

## అమ్మవోతె అడివయ్యే కాలమచ్చింది

రెండేండ్ల కిందటి వరకు మా ఊరి చుట్టూ ఎటు చూసినా పత్తి చేన్లే కనిపించేవి. కాళేశ్వరం నీళ్లు ఎప్పుడైతే అచ్చినయో అప్పటి సంది మా ఊరితోపాటు చుట్టుపక్కల అన్ని వరి పొలాలే చేసిన్రు. నేను మాత్రం డిమాండ్ ఉంటదేమోనని ఆశపడి పత్తేసిన. నాకున్న ఒక ఎకరంతోపాటు ఆరెకరాలు కౌలుకు తీసుకొని పండించిన. కానీ, నా ఆశ నిరాశే అయింది. సీసీఐ కొంటలేకపాయె. పండించిన పంట ఇంట్లపెట్టుకుంటె తేమతోని పాడైపోతది. ఇగ గతిలేక తక్కువకైనా అమ్ముకుంటన్నం. మంగళవారం 17 క్వింటాళ్ల పత్తి అమ్మిన. క్వింటాల్‌కు ₹6,300 చొప్పున ఇచ్చిన్రు. మా పరిస్థితి అధ్వానమైంది. అమ్మవోతె అడివయ్యే కాలమచ్చింది. సర్కారు మా బాధలను అర్థం చేసుకోవాలె. మద్దతు ధర ఇచ్చి మమ్ముల ఆదుకోవాలె.

**- మొగుల్ల అయిలయ్య, వెలిచాల (రామడుగు మండలం)**



# జిన్నింగ్ మిల్లుల మాయాజాలం

## పత్తి రైతుకు ధరాఘాతం



- నామమాత్రపు కొనుగోళ్లకే సీసీఐ పరిమితం
- ఇదే అదనుగా మిల్లుల యజమానుల దోపిడీ
- వరంగల్‌లో క్వింటాల్‌కు ₹6800 చెల్లింపు
- ఉమ్మడి జిల్లాలో కేవలం ₹6200లే
- భారీగా నష్టపోతున్న రైతులు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

**జిన్నింగ్ మిల్లులు మాయాజాలం ప్రదర్శిస్తున్నాయి. పత్తి రైతులను అందినకాడికి దోచుకుంటున్నాయి. అగ్గువకే పత్తిని కొంటూ అడ్డగోలు దోపిడీ చేస్తున్నాయి. అండగా నిలువాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నామమాత్రపు కొనుగోళ్లకే పరిమితం కావడం మిల్లుల యజమానులకు కలిసి వస్తున్నది. అకాల వర్షాలు, అనుకూలించని వాతావరణ పరిస్థితులతో ఈసారి భారీగా దిగుబడి తగ్గి నష్టపోతున్న రైతు, చివరకు పంటను అమ్ముకోవడానికి సైతం అరిగోస పడాల్సిన దుస్థితి నెలకొన్నది. గత్యంతరం లేని పరిస్థితుల్లో తెగనమ్ముకోవాల్సి వస్తున్నది. ఇంత జరుగుతున్నా అధికాయంత్రాగం పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పత్తి కొనుగోళ్లు, విక్రయాలపై ప్రత్యేక దృష్టిసారించి, రైతులను ముంచుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**

కరీంనగర్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు ₹7,521 చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. ఉమ్మడి జిల్లాలో మాత్రం ఆ ధర మచ్చుకైనా కనిపించడం లేదు. తేమ శాతం తగినంత లేదని, నాణ్యత లోపించందని, రంగు మారిందని, గింజ పొడువు సరిగా లేదని రకరకాల కొర్రీలు పెడుతూ.. పత్తిని కొనేందుకు సీసీఐ నిరాకరిస్తున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే 12 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు ప్రకటించారు. అందులో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని జిన్నింగ్ మిల్లులు, ఇతర ప్రాంతాలు కలిపి మూడు చోట్ల కేంద్రాలు ఉన్నాయని చెబుతున్నారు. అలాగే జమ్మికుంట మార్కెట్ పరిధిలో 7, చొప్పదండి, గోపాల్‌రావుపేట మార్కెట్ పరిధిలో ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. మెజార్టీ కేంద్రాలు ఆయా జిన్నింగ్ మిల్లుల్లోనే ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేస్తున్నారు. అయితే గడిచిన వారం రోజుల్లో ఈ 12 కేంద్రాల ద్వారా సీసీఐ కొన్న పత్తి మొత్తం 106 క్వింటాళ్లు మాత్రమే. అంటే సీసీఐ పనితీరు ఎలా ఉందో చెప్పడానికి కొనుగోళ్లే నిదర్శనంగా నిలుస్తున్నాయి.

### యజమానుల దోపిడీ!

సీసీఐ కేంద్రాల ప్రారంభం కేవలం పేపర్‌పైనే కనిపిస్తున్నది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉన్నది. సవాలక్ష కారణాలు చూపుతూ పత్తి కొనడం లేదు. మద్దతు ధరకు కొనాలని రైతులు కోరుతున్నా ఏ మాత్రం పట్టించుకోడం లేదు. దీంతో రైతులు సదరు పత్తిని ఇంట్లో పెట్టుకోలేక.. ధర వచ్చే వరకు నిల్వచేసుకునే సామర్థ్యం లేక తెగనమ్ముతున్నారు. ఇదే అదునుగా కొంత మంది జిన్నింగ్ మిల్లుల యజమానులు దోపిడీకి పాల్పడుతున్నారు. మద్దతు ధర క్వింటాల్‌కు ₹7,521 కాగా, మెజార్టీ చోట్ల కేవలం ₹6,200కే కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల అందులోనూ కోతలు పెడుతున్నారు. మరికొందరైతే ₹6100 కూడా చెల్లించడానికి తిప్పలు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. నిజానికి పక్కనే ఉన్న వరంగల్ జిల్లాలో మంగళవారం క్వింటాల్ పత్తిని ₹6800తో కొనగా, కరీంనగర్ జిల్లాలో మాత్రం కొంత మంది జిన్నింగ్ మిల్లులు యజమానులు కేవలం ₹6,200తో కొనుగోలు చేశారు. అంటే ఒక్కో క్వింటాల్‌పై ఎంతలా దోపిడీ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. పత్తి విక్రయాల ఆరంభం నుంచి నేటి వరకు ఇదే దందా కొనసాగుతుంది. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో విక్రయిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నిఘా అవసరం

ఇప్పటికే అకాల వర్షాలు, అనుకూలించని వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ సారి పత్తి దిగుబడులు ఆశించినంతగా రావడం లేదని స్వయంగా వ్యవసాయ అధికారులే చెబుతున్నారు. ఓ దశలో పెట్టిన పెట్టుబడులు వచ్చినా చాలవని రైతులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీసీఐ కేంద్రాల ద్వారా మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా మంత్రులు, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరమున్నది. కానీ, ఈ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. అధికారుల నిఘాలోపం కూడా జిన్నింగ్ మిల్లుల యజమానుల దోపిడీకి కలిసి వస్తున్నది. అధికారుల ఉదాసీన వైఖరి, మిల్లుల యజమానుల మాయాజాలంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు న్యాయం చేసేందుకు అధికార యంత్రాగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రాలకు వస్తున్న పత్తి నిబంధనలకు అనుగుణంగా ఉన్నదా..? లేదా..? అన్నది సీసీఐ, అలాగే ప్రైవేట్ వ్యాపారులకు మాత్రమే వదిలి వేయకుండా ప్రత్యేకంగా కేంద్రాల వద్ద నియమించే యంత్రాంగం కూడా పరీక్షలు చేయాలనే వాదనలు వస్తున్నాయి. అంతేకాదు, ఒక్కో కేంద్రం వద్ద ఒక్కో అధికారిని నియమించి.. రోజు వారీ క్రయ విక్రయాలపై ప్రతేక దృష్టిపెట్టాల్సిన అవసరమున్నది. నిబంధనలకు లోబడి ఉన్న రైతుకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా మద్దతు ధర వచ్చేలా చూస్తే కొంత మేరకైనా న్యాయం జరిగే అవకాశముంటుంది. ఇదే సమయంలో సీసీఐ కేంద్రాలు జిన్నింగ్ మిల్లుల వద్దే ఉన్నాయని, యజమానులు, సీసీఐ అధికారులు కుమ్మక్కు కాకుండా చూడాల్సిన బాధ్యతను సైతం కేంద్రం వద్ద నియమించే అధికారికే అప్పగిస్తే పత్తి రైతులకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రభుత్వం నేరుగా కొంటే బాగుండు

నాకు దేశరాజ్‌పల్లిలో మూడెకరాల భూమి ఉన్నది. ఈ సారి నీళ్లు లేక పత్తి వేసిన. కాపు మంచిగనే వచ్చింది. కానీ, సరైన సమయంలో పత్తికి నీళ్లందలేదు. అట్లనే కాలం కూడా సహకరించలేదు. దిగుబడి గతం కంటే తక్కువగా వచ్చింది. వచ్చిన పంటను మద్దతు ధరతో సీసీఐ వాళ్లు కొంటే మంచిగుండేది. కానీ, వాళ్లు కొంటలేరు. ఏమన్నంటే మీ పత్తి మంచిగలేదంటున్రు. మేం మంచిగ ఆరబెట్టి తెచ్చినా తేమ ఉందంటున్రు. మా అవసరాలు మాకున్నయి. మిల్లుకు వస్తే వాళ్లు చెప్పిందే ధర అయితంది. కొంతమంది క్వింటాల్ ₹6వేలకే అమ్ముకుంటున్నరు. ఇంకా కొంతమంది ₹6200కు అమ్ముకున్నరు. నాది అదే పరిస్థితి. గట్టిగా అడిగితే అయింత కొంటరో.. కొనరో అనే భయం. సీసీఐ కొంటే మద్దతు ధర వచ్చేది. సంతోషంగా ఉండేటోళ్లం. సీసీఐ కొనక పోవడం వల్లే జిన్నింగ్ మిల్లులకు అమ్ముతున్నం. కష్టపడి పండించిన పత్తిని తక్కువ ధరకు అమ్మాలని మాకెవ్వరికి ఉండదు. కానీ, ఏమి జేత్తం? కష్టమో నష్టమో అమ్మక తప్పడం లేదు. పోనీ ధర చ్చేవరకు ఇంట్లో నిల్వజేసే పరిస్థితి లేదు. మా బాధలను చూసైనా అధికారులు పట్టించుకోవాలి. పత్తి రైతులకు జర రేటు ఎక్కువ వచ్చేటట్టు చేయాలి.



**- కే గంగయ్య, దేశరాజ్‌పల్లి (రామడుగు మండలం)**



మ్యూజికల్ పౌంటేన్‌ను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

## మల్టీపర్పస్ పార్క్ రెడీ

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 29 : కరీంనగరం నడ్డిబొడ్డున ప్రజలకు ఆహ్లాదం పంచేలా రూపొందిస్తున్న మల్టీ పర్పస్ పార్క్ ప్రారంభానికి సిద్ధమవుతున్నది. స్మార్ట్‌సిటీలో భాగంగా ఆరెకరాల స్థలంలో సుమారు ₹12 కోట్ల వ్యయంతో దీనిని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పార్కు అభివృద్ధికి సంబంధించి మిగిలిన అన్ని పనులు పూర్తి చేసిన అధికారులు, విద్యుత్ అధికారుల నుంచి ప్రత్యేకంగా ట్రాన్స్‌పార్మర్స్ ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పనులు పూర్తయితే పార్కును అందుబాటులోకి తేనున్నారు. ముఖ్యంగా ఈ పార్కులో ₹2 కోట్లతో మ్యూజికల్ పౌంటేన్‌ను సిద్ధం చేశారు. మంగళవారం రాత్రి దీనికి జనరేటర్ ద్వారా ట్రయల్ రన్‌ను నిర్వహించారు. నగర మేయర్ యాదగిరి సునీల్ రావు కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్కును అతి త్వరలోనే అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఆహ్లాదకర వాతావరణం కోసం గ్రీనరీ, రకరకాల పూల మొక్కలు, సీటింగ్ కోసం బెంచీలు, గజీబోలు, చారిత్రాత్మక చిత్రాల ప్రదర్శన కోసం ఒక ఆంఫీ థియేటర్, ఈపీడీఎం వాకింగ్ ట్రాక్, చిన్నారులకు ఆట పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. ఫుడ్ కోర్టులు, క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామని, పార్కులోకి ఎంట్రీ టికెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. విద్యుత్ వినియోగం కోసం 500 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు. ఆయనవెంట కార్పొరేటర్లు ఐలేందర్, నాయకులు గందె మహేశ్, ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ యాదగిరి ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ మేయర్ రవీందర్‌సింగ్

## రేవంత్ కక్షసాధింపు రాజకీయాలు మానుకో

### మాజీ మేయర్ రవీందర్‌సింగ్

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 29 : ఎంతసేపు బీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేయాలన్న ఆలోచనే తప్ప రేవంత్‌రెడ్డికి పరిపాలన చేయాలన్న సోయి లేకుండా పోయిందని మాజీ మేయర్ రవీందర్‌సింగ్ విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు చేయకుండా ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టి మరల్చేందుకు ఇలా కుట్రలు చేయడం సరికాదని సూచించారు. ఇప్పటికైనా సంక్షేమ పథకాలపై దృష్టి సారించాలని, కక్షసాధింపు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సంస్కృతిలో మందు, ముక్క లేకుండా దావత్ జరగదని, ఇప్పటికిప్పుడు రాష్ట్రంలోని మంత్రుల ఇళ్లలో సోదాలు చేస్తే లెక్కకు మించిన ఫారిన్ మందు బాటిల్స్, దేశీయ మందు బాటిల్ దొరుకుతాయని పేర్కొన్నారు. మరి మంత్రుల ఇండ్లపై ఎక్సైజ్ సోదాలు చేస్తుందా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పోలీసులు ధర్నాలు చేస్తున్న పరిస్థితి ఉన్నదని, శాంతిభద్రతలు ఎక్కడ ఉన్నాయని అని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర గవర్నర్ స్పందించాలని కోరారు. పొంగలేటి శ్రీనివాస్ రెడ్డికి రేవంత్‌రెడ్డి ఏమైనా హోం శాఖ ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారా అని అడిగారు. దీపావళిలోపే బాంబు పేల్చుతామని అన్నారని, ఆయన ఇంట్లోనే బాంబు పేలిందని, ఈడీ దాడులు విచారణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్ కుమార్, కెసారం తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఆన్‌లైన్‌లో యాప్‌లు మాయం!

మొదట్లో సక్రమంగానే కనిపించిన క్రిప్టో కరెన్సీ యాప్‌ల వ్యవహారం, కొన్నాళ్లుగా ఇబ్బందికరంగా మారుతూ వచ్చింది. ₹వేలాది కోట్లు పెట్టుబడులు పెట్టిన తర్వాత రోజువారీగా డాలర్ల రూపంలో యాప్‌లో కనిపించాల్సిన లెక్కలు కనిపించకుండా పోవడం ఆరంభమైంది. చూస్తుండగానే యాప్‌లు ఆన్‌లైన్‌లో కనిపించకుండా పోవడం మొదలైంది. దీంతో పెట్టుబడి పెట్టిన వారంతా నిండా మునిగిపోయినట్టు గుర్తించడం మొదలు పెట్టారు. చైన్ సిస్టంలో భాగంగా తమను చేర్పించిన స్టార్‌ల వద్దకు, స్టార్‌లు తమపై ఉన్న స్టార్‌ల వద్దకు పరుగులు తీయడం ప్రారంభించారు. అయితే, ఆన్‌లైన్ వ్యాపారం కావడం, యాప్‌లను ఎవరు నిర్వహిస్తున్నారో ఎవరికీ తెలియకపోవడంతో ఇన్నాళ్లూ వ్యాపారం చేసిన వారు బిక్కమొకం వేసుకొని చూస్తున్నారు. యాప్‌ల గురించి ఎవరిని ప్రశ్నించాలో సైతం తెలియని పరిస్థితిలో పడిపోయారు. పెట్టుబడి పెట్టిన సమయంలో యాప్ కోసం ఇచ్చిన సాఫ్ట్‌వేర్‌లో తమపై పేర్లపై ఉన్న పేర్లను ఆధారంగా చేసుకొని వారిని సంప్రదించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, చాలా మట్టుకు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు, ఇతర దేశాలకు చెందిన వారే ఉండడంతో వారిని కలుసుకొని, ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో చాలా మంది బ్రోకర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోగా, పెట్టుబడి పెట్టిన వారు పోలీస్ స్టేషన్లకు వెళ్లడం మొదలు పెట్టారు.

### ఆశ చూపి పెట్టుబడులు పెట్టించి..

క్రిప్టో కరెన్సీపై ప్రభుత్వ నిషేధం లేకపోవడం, వ్యక్తిగతంగా నిర్వహించుకునే అవకాశం ఉడడంతో పలువురు బ్రోకర్లు జగిత్యాల జిల్లాలో క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్ దందాలకు తెర లేపారు. భారత రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా క్రిప్టో కరెన్సీ పేరిట బ్లాక్ చైన్ వ్యాపారాన్ని సైతం ప్రారంభించారు. పేరు లేని అనామకమైన కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకరాగా, ఆన్‌లైన్ యాప్‌లతో వ్యాపారం మొదలు పెట్టారు. పెట్టుబడి మొత్తం ఆన్‌లైన్‌లో పెట్టాల్సి ఉంటుందని, డాలర్ల రూపంలో లెక్క ఉంటుందని, రోజూ డబ్బు జమవుతుందని, ట్యాక్స్ కట్టి అవి తీసుకునే అవకాశం ఉందని నమ్మించారు. ₹లక్ష పెట్టుబడి పెడితే నెలకు ₹16 వేల చొప్పున ఏడాది పాటు డబ్బులు వస్తాయని ఆశ పెట్టారు. ఈ లెక్క ప్రకారం 12 నెలల కాలంలోనే దాదాపు రెట్టింపు డబ్బు వస్తుందని నమ్మి, చాలా మంది పెట్టుబడి పెట్టడం ప్రారంభించారు. ఇది ఒకరి నుంచి ఒకరికి పాకడం ఆరంభమై, పలువురు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టారు. కొందరు ఐదు నుంచి ఆరు శాతం వడ్డీకి తెచ్చి ₹లక్షల్లో పెడితే.. మరికొందరు ఉన్న బంగారు ఆభరణాలు, భూములు, ఇండ్లను విక్రయించి, కుదవపెట్టి మరీ డబ్బులు పెట్టారు. ఒకానొక దశలో భార్య మెడలో ఉన్న పుస్తెలతాడును సైతం తాకట్టు పెట్టినవారు ఉన్నారని చెబుతున్నారు. రెండేండ్ల క్రితం చినుకులా మొదలైన ఈ వ్యాపారం చూస్తుండగానే జడివానలా మారింది. ఏకంగా ₹1400 కోట్ల నుంచి ₹1600 కోట్ల మధ్య పెట్టబడులు పెట్టినట్టు ఆర్థిక నిపుణుల ద్వారా తెలుస్తున్నది. ఈ దెబ్బకు కొన్నాళ్లపాటు ఇతర ప్రధాన వ్యాపారాలన్నీ స్తంభించిపోయాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. రియల్ ఎస్టేట్ నుంచి మొదలుకొని వడ్డీ, బంగారం వ్యాపారం, ఫైనాన్స్ వ్యవస్థలు సైతం కుదేలయ్యాయంటున్నారు.

### గ్రామాల్లో విచ్చలవిడిగా ఏజెంట్లు

వీఎంటీ, రెక్సోర్స్, మెటాఫండ్ లాంటి కంపెనీలు ఏజెంట్లను నియమించుకొని, చైన్‌సిస్టం వ్యాపారాన్ని మొదలు పెట్టాయి. ఒక కంపెనీలో పెట్టుబడి పెట్టిన వ్యక్తి, మరొకరిని వ్యాపారంలో చేర్పిస్తే 50 శాతం కమీషన్ వస్తుందని ఆశ చూపాయి. వ్యాపారంలో పెట్టుబడి పెట్టించిన వారి సంఖ్యను బట్టి, చైన్ సిస్టం నిర్వహిస్తున్న వారికి స్టార్‌లను కేటాయించడం మొదలు పెట్టారు. టూ స్టార్, త్రీ స్టార్, ఫోర్ స్టార్, ఫైవ్ స్టార్, సిక్స్ స్టార్, సెవెన్ స్టార్ అంటూ కేటగిరీలను ఏర్పాటు చేశారు. స్టార్ హోదా వచ్చిన వారికి అదనపు వేతనాన్ని, పారితోషికాలను, వాహనాలను గిఫ్ట్‌లుగా ఇవ్వడం మొదలు పెట్టారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో క్రిప్టో పేరిట తప్పుడు యాప్‌లకు ఏజెంట్లు విచ్చలవిడిగా పుట్టుకొచ్చారు. ఒక్కో ఊరిలో పదుల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా గ్రామంలో కీలకంగా వ్యవహరించే రేషన్ డీలర్లు, ఎల్ఐసీ ఏజెంట్లు, చోటామోటా పొలిటీషియన్లు యాప్‌లలో పెట్టుబడులు పెట్టించారు. రాయికల్ మండలంలోని ఒక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ముగ్గురు ఏజెంట్లు కనీసం ₹వంద కోట్ల పెట్టుబడులు పెట్టినట్టు తెలుస్తున్నది. అలాగే, జగిత్యాల అర్బన్ మండలంలోని ఒక ఊరిలో ఓ ఏజెంట్ సెవెన్ స్టార్ స్థాయికి చేరుకొని, గ్రామంలో వందలాది మందిని వ్యాపారంలో భాగస్వామ్యం చేసినట్టు సమాచారం. సదరు వ్యక్తి రోజుకు ₹5 లక్షలకుపైగా వేతనం పొందినట్టు తెలిసింది. దీనికి తోడు సదరు సెవెన్ స్టార్‌కు కంపెనీ నిర్వాహకులు హైదరాబాద్‌లో విల్లాతోపాటు ₹లక్షల విలువైన కారును బహుమానంగా ఇచ్చినట్టు సమాచారం. జిల్లాలో ఇద్దరు సెవెన్ స్టార్లు, పదుల సంఖ్యలో ఫైవ్ స్టార్ రేటింగ్ చేసిన ఏజెంట్లు, వందల సంఖ్యలో ఇతర స్టార్ ర్యాంకింగ్‌కు చేరిన ఏజెంట్లు ఉన్నట్టు తెలిసింది.

# నిండాముంచిన 'క్రిప్టో'

**ఏడాది పాటు జగిత్యాల జిల్లాను ఊపేసిన ఆన్‌లైన్ యాప్‌లు**



## ఏజెంట్ల అవతారమెత్తిన టీచర్లు, పోలీసులు, డాక్టర్లు, ఆర్ఎంపీలు

- ఏడాదిన్నరలో ₹1400 కోట్ల నుంచి ₹1600 కోట్ల వరకు పెట్టుబడులు
- నెట్‌లో కనిపించకుండా పోతున్న కరెన్సీ యాప్‌లు
- చైన్ సిస్టం నిర్వహించి ఉడాయించిన బడా స్టార్‌లు
- లబోదిబోమంటున్న పెట్టుబడిదారులుల
- పెద్ద మొత్తంలో నష్టపోయిన రాజకీయ నాయకులు, వైద్యులు
- వ్యాపారం చేయించిన స్టార్ ఏజెంట్ల వద్దకు పరుగులు
- మౌనం వీడి పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కుతున్న బాధితులు
- కేసులు నమోదు చేస్తున్న పోలీసులు

**జగిత్యాల జిల్లాను క్రిప్టో కరెన్సీ కుదిపేస్తున్నది. ఏడాదిన్నరలో ఒక ఊపు ఊపిన క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్ చైన్‌లింక్ దందా, మెల్లగా తన అసలు రంగును బయటపెడుతున్నది. అత్యధిక కమీషన్ వస్తుందనే దురాశతో ఏజెంట్లు నమ్మించి పెట్టుబడులు పెట్టించగా.. ప్రభుత్వోద్యోగులు, సామాన్యులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు ఈ మాయలో పడి నిండా మునిగినట్టు తెలుస్తున్నది. దాదాపు రెండేండ్ల వ్యవధిలో ఏకంగా ₹1400 కోట్ల నుంచి ₹1600 కోట్ల మధ్య పెట్టబడులు పెట్టినట్టు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తుండగా, ఇప్పుడు ఆన్‌లైన్‌లో యాప్‌లు కనమరుగవుతుండడం వేలాది మందిని ఆందోళనకు గురిచేస్తున్నది.**

జగిత్యాల, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : క్రిప్టో కరెన్సీ అంటే చాలా మందికి తెలియకపోవచ్చు గానీ, బిట్‌కాయిన్ అంటే మాత్రం అందరికీ తెలిసిపోయింది. వాస్తవానికి క్రిప్టో కరెన్సీ అంటే నగదురహిత ద్రవ్యంగా చెప్పుకోవచ్చు. ప్రపంచీకరణ నేపథ్యంలో యూరప్‌తోపాటు అమెరికా వంటి ఖండాల్లో క్రిప్టో కరెన్సీని రూపొందించారు. పెట్టుబడులు, డబ్బు విడిపించుకోవడం ఇలా అన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారు. ఇది కేవలం వ్యక్తిగతం. అయితే దీనిని అభివృద్ధి చెందిన దేశాలు అనుమతించాయి. క్రిప్టో కరెన్సీ పద్ధతిలో బిట్‌కాయిన్‌తోపాటు వజీర్ ఎక్స్, యూనోకైన్, కైన్‌డీసీఎక్స్, కాయిన్ స్విచ్, ఎథీరియం ఇలా 20కి పైగా కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతున్నాయి. మనదేశంలో మాత్రం క్రిప్టోకు అనుమతి లేదు. కానీ, భారత ఆర్థిక శాఖ మంత్రి పార్లమెంట్‌లో మాత్రం ఒక ప్రకటన చేశారు. 'క్రిప్టో కరెన్సీని కొనాలనుకుంటే కొనచ్చు. కానీ, ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వదు. ఈ డాలర్లలోనే నిర్వహించుకోవాల్సి ఉంటుంది' అని చెప్పారు. అయితే డాలర్లను రూపాయిలోకి మార్చుకునే సందర్భంలో మాత్రం నిర్దేశిత ట్యాక్స్ చెల్లించాలని స్పష్టం చేశారు.

### ఏజెంట్ల అవతారం ఎత్తిన అఫీషియల్స్

బిట్ కాయిన్, క్రిప్టో కరెన్సీని బాగా ప్రమోట్ చేసి, కోట్లాది రూపాయలు పెట్టుబడిగా పెట్టించడంలో బాధ్యతాయుతమైన వృత్తుల్లో ఉన్నవారే కీలక పాత్ర పోషించినట్టు తెలుస్తున్నది. నిర్మల్ జిల్లాలో రెండు నెలల క్రితం కేసులు నమోదైన సందర్భంలో టీచర్లు ప్రధాన పాత్ర పోషించినట్టు గుర్తించిన విషయం విధితమే. జగిత్యాల జిల్లాలో సైతం ముఖ్యంగా ప్రభుత్వోపాధ్యాయులే క్రిప్టో కరెన్సీ బ్లాక్ చైన్ సిస్టంను బాగా పెంచినట్టు సమాచారం. పదుల సంఖ్యలో టీచర్లు వేలాది మందితో పెట్టుబడులు పెట్టించినట్టు తెలుస్తున్నది. ప్రధానంగా సంఘ నాయకులుగా చెలామణి అవుతున్న కొందరు తమ పరపతిని వాడి పెద్ద సంఖ్యలో చేర్పించినట్టు సమాచారం. పోలీస్ శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు సైతం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడంతోపాటు చైన్లను వృద్ధి చేసినట్టు తెలిసింది. జిల్లాలో గతంలో పనిచేసి, తర్వాత పనిష్మెంట్‌పై వెళ్లిన ఓ పోలీస్ అధికారి ₹కోట్లలో పెట్టుబడి పెట్టినట్టు సమాచారం. అలాగే, నలుగురైదుగురు ఎస్ఐలు సైతం భారీగానే పెట్టుబడులు పెట్టినట్టు తెలుస్తున్నది. దాదాపు జిల్లాలో 50 నుంచి 60 మంది కానిస్టేబుళ్లు క్రిప్టో మాయలో పడినట్టు సమాచారం.

### నాయకుల నెత్తిన సైతం టోపీ

రాజకీయ నాయకులు సైతం క్రిప్టో కరెన్సీ మాయలో పడిపోయారు. చాలా మంది ద్వితీయ శ్రేణి నాయకులు లబోదిబోమంటున్నారు. ఒక ప్రముఖ పార్టీకి చెందిన రాజకీయ నాయకుడి సోదరుడు దాదాపు ₹ఐదు కోట్ల పెట్టుబడులు స్వయంగా పెట్టడంతో పాటు దాదాపు ₹50 కోట్ల నుంచి ₹60 కోట్ల వరకు పెట్టుబడిగా పెట్టించినట్టు తెలిసింది. అలాగే, మరో ద్వితీయ శ్రేణి నాయకుడు ₹18 లక్షలు పెట్టినట్టు సమాచారం. ఇలా వందల సంఖ్యల్లో నాయకులు పెట్టుబడులు పెట్టడంతోపాటు తమకు ఉన్న పరపతిని వినియోగించి, పెట్టుబడులు పెట్టించినట్టు తెలుస్తున్నది. యాప్‌లలో పెట్టుబడి పెట్టిన కొందరు రాజకీయ నాయకులు మాట్లాడుతూ, దసరా పండుగను సైతం తాము చేసుకోలేని పరిస్థితికి దిగజారిపోయామని ఆవేదన వ్యక్తంచేయడం గమనార్హం.

### విదేశాల్లో ఎంజాయ్

యాప్‌లో పెట్టుబడి పెట్టినవారితో పాటు పెట్టుబడి పెట్టించిన బ్రోకర్లు పెద్ద మొత్తంలో షోకులు చేయడం కొన్నాళ్లుగా నిత్యకృత్యం అయిపోయింది. పెట్టుబడి పెట్టి, బ్లాక్ చైన్ సిస్టంలో భాగస్వామ్యం అయిన పలువురిని కంపెనీ ప్రతినిధులు విదేశాలకు తీసుకెళ్లడం బహిరంగ రహస్యంగా మారిపోయింది. పలువురు టీచర్లు, ఉద్యోగులు సింగపూర్, మలేషియా, థాయిలాండ్, దుబాయి వంటి దేశాలకు విహారయాత్రలకు తీసుకువెళ్లడం మొదలుబెట్టారు. కొన్నాళ్ల క్రితం వరకు జిల్లాలో పనిచేసి ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఇద్దరు ముగ్గురు ఎస్ఐలు సైతం సింగపూర్, మలేషియా, దుబాయ్ పర్యటనలకు వెళ్లి మజా చేసి వచ్చినట్టు సమాచారం.

### బాధితుల లబోదిబో

పెట్టబడులు పెట్టిన వారిలో దాదాపు అన్ని వర్గాల వారు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు సామాన్యులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు ఉన్నారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో యాప్‌లు కనుమరుగు కావడంతో వీరంతా లబోదిబోమంటున్నారు. ఏడాదిలోపే రెట్టింపు డబ్బులు వస్తున్నాయన్న ఆశతో లక్షల్లో పెట్టుబడులు నిండా మునిగామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పుడు బాధితులంతా సంఘాలుగా ఏర్పడి పోరాటం చేయాలన్న ఆలోచనలు చేస్తున్నారు. ఈ దందా విషయమై పోలీస్ అధికారులు మాట్లాడుతూ, క్రిప్టో కరెన్సీ యాప్‌లకు ప్రభుత్వ అనుమతి లేదని ముందు నుంచీ చెబుతున్నామని, ఇప్పుడు అందరూ తమకు న్యాయం చేయాలని కోరుతుండడం చూస్తే బాధాకరంగా ఉందన్నారు. ఫిర్యాదులు వస్తే కేసులు చేసి దర్యాప్తు జరుపుతామని చెప్పారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇటీవల కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్ట్ చేశామని, ఇంకా పలు కేసులు నమోదయ్యే అవకాశాలున్నాయన్నారు.